# సంపాదకీయము

మనమనుభవించే ఈతి బాధలు షడ్విధములు. దేహమే ఆత్మయను బుద్ధి, మనము స్వతంత్రులమనే బుద్ధి, మనము పరమాత్మకు కాక యితరులకు చెందిన వారమనే బుద్ధి, మనలను మనము రక్షించుకొనగలమనే బుద్ధి, శరీర బంధువులే బంధువులనే బుద్ధి మరియు ఇంద్రియజన్య విషయములననుభవించవలననే బుద్ధి యనే ఈ ఆరు రకములైన భావములు వాటికి సంబంధించిన బాధలు మనలను బ్రహ్మాండమును చేర నడ్డుకొనును.

కృష్ యంటే అపరిమితము, ణ యంటే ఆనందము. కృష్ణ యంటే అపరిమితమయిన యానందమునిచ్చువాడు. శ్రీ కృష్ణుని యనుగ్రహముతో మాత్రమే బ్రహ్మాండము చేరి దానిలో సంచరింపవీలగును. ఇది భగవద్గీత నుడివిన సత్యము. ఆకాశతత్వమును పరిపూర్ణముగా నెరిగినవాడే యనగా పైన నుడివిన ఈతిబాధలనధిగమిచినవాడై కృష్ణతత్వములో నిరంతరము సంచరించువాడే బ్రహ్మాండములో సంచరింపనర్హుడు. హృదయములో కాంతి లేని జ్యోతిని లక్ష్యముగా నిడుకొని ధ్యానము చేసే మనకు ఆదిలో కాంతి కనిపించినా పిండ దేశమునధిగమించునపుడు అభయమొసగే కారుచీకటి అనుభవమునకు వస్తుంది. అయితే పూజ్య బాబూజీగారి కృపావిశేషఫలితముగా మన గమనం కొనసాగించి బ్రహ్మాండము ప్రవేశించేస్తాము. శ్రీ కృష్ణ శ్రీ రామచంద్రుల కలయికచేకలిగిన గంగాజామునీగా మనము నిరంతర మనుభవించే ప్రాణాహుతి ఈతి బాధలనుండి మనలను విముక్తి గావించడము సాధకులనుభవము. శ్రావణ మేఘములు కారు మబ్బులకూ విద్యుల్లేఖలకూ విశేషము. శ్రీ కృష్ణ కటాక్షమూయంతే. వీటినే మన ధ్యానములో అనుభవించడము జరుగుతుంది. మనకు కలుగు అనుభవములు మన సాధన వల్ల కలిగినవనడము సగము పొల్లు సగము నిజము. ఈశ్వర కటాక్షము లేనిదే పదే పదే మనము వివిధ గ్రంధులలో యాత్ర జరిపినా వాటిపై ఆధిక్యత పొందలేమని మన గురువు గారి లేఖలద్వారా తెలుసుకొన్నాము. అయినా శ్రీ కృష్ణ అవతారము మనకు చెప్పినదల్లా 'సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి' యని మాత్రమే. పాప పుణ్యములు పిండదేశములో మన ప్రవర్తన బట్టి యుంటుంది. బ్రహ్మాండములో పాప పుణ్య ప్రసక్తి యుండదు. అందువల్ల భోగ భాగ్యముండదు. ఇక పయనం మాట ఏముంది. అందువల్ల అచ్చట మన ఆధ్యాత్మిక పయనము పిండదేశములోని స్థితులకు కలుగు పరిపక్వత, వైశాల్యము మాత్రమే. అవే బ్రహ్మాండములో ప్రతిబింబించి ఉన్నతమయి మరియు సునిశితమై సూక్ష్మతచెంది మన పురోగతికి తోడ్పడుతుంది. ఇది గంగాజామునీ గలిగిన ప్రాణాహుతి ద్వారా మాత్రమే సాధ్యము. ఇది శ్రీ కృష్ణ శ్రీ రామచంద్ర ప్రభల సంయోగము మరియు ఐక్యత

వలన కలిగిన మానవ సౌభాగ్యము.  మన సంస్థకు అధిపతియయిన శ్రీ కృష్ణ జన్మదినము మనకు పరమ పవిత్రము.  శ్రీ కృష్ణ ప్రేమను పొందిన గోపికలకన్నా, యుగపురుష యుగళముల ప్రేమ గలిగిన వారందరూ ధన్యులే.  వారిలో మనమూ యున్నామని తెలుసుకొని మనుగడ సాగించడము మన బాధ్యత మరియూ మన అదృష్టమూ కూడా.  తథాస్తు.

శ్రీ కృష్ణ జయంతి
2004

(సత్యపథము : జన్మాష్టమి సంచిక : 11-3)